

ఆ ఐదు నియోజకవర్గాల్లో అనిశ్చితి

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా.. మూడు నియోజకవర్గాలకు మాత్రమే టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ ఐదు నియోజకవర్గాల్లోనూ టీడీపీ బలంగానే ఉంది. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. మరోవైపు వైసీపీ ప్రజాప్రతినిధులపై సొంతపార్టీలోనే అసంతృప్తి.. వర్గపోరు తీవ్రంగా ఉంది. ఇక్కడ టీడీపీ గెలుపు నల్లేరుపై నడక లాంటిదే. కానీ ఇక్కడ అభ్యర్థుల పేర్లను ప్రకటించకపోవడంతో ఆశావహులు.. ప్రస్తుత నియోజకవర్గాల ఇన్‌చార్జిల్లో అనిశ్చితి.. నిరీక్షణ నెలకొంది. ఈనెల 26న శ్రీకాకుళం వస్తున్న 'రా కదలిరా' సభలోనైనా అభ్యర్థుల పేర్లను చంద్రబాబునాయుడు ప్రకటిస్తారేమో అని టీడీపీ శ్రేణులు ఎదురుచూస్తున్నారు.

సమరానికి సై

- టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల
- జిల్లాలో ముగ్గురికి టికెట్లు ఖరారు
- టెక్కలి, ఇచ్ఛాపురంలో సిట్టింగ్‌లకే..
- ఆమదాలవలసలో పార్టీ జిల్లా అధ్యక్షుడికి కేటాయింపు
- ఇంకా తేలని ఐదు నియోజకవర్గాల భవిత
- ఆశావహుల్లో నిరీక్షణ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల సమరానికి టీడీపీ-జనసేన ఉమ్మడిగా సై అంటున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఇరుపార్టీల అధినేతలు అభ్యర్థుల తొలిజాబితా విడుదల చేశారు. జిల్లాలో ముగ్గురికి టికెట్లు ఖరారు చేశారు. టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస నియోజకవర్గాలకు సంబంధించి కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్, కూన రవికుమార్‌కు టికెట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులతో పాటు అనుచరుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక జిల్లాలో మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో టికెట్ల కేటాయింపుపై సందిగ్ధత కొనసాగుతోంది. రెండో జాబితా కోసం ఆశావహుల్లో నిరీక్షణ కనిపిస్తోంది.



అచ్చెన్నాయుడు



కవిటి: రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే అశోక్‌తో టీడీపీ నేతలు, కార్యకర్తల సందడి

● అశోకుడికే ఇచ్ఛాపురం..

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్.. వైద్యవృత్తి నుంచి రాజకీయా ల్లోకి వచ్చారు. కుటుంబానికి రాజకీయ నేపథ్యంలో ఉండడంతో 2014లో ఇచ్ఛాపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అశోక్ తొలిసారిగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ 'ఒక్కచాన్స్' హవా ఉన్నా.. ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపలేదు. రెండోసారి అశోక్ గెలుపొందారు. తాజాగా అధిష్టానం ఆయనకు టికెట్ కేటాయించడంతో ముచ్చటగా మూడోసారి బరిలో దిగి హ్యాట్రిక్ విజయం సాధించేందుకు సన్నద్ధమవుతు న్నారు. శనివారం ఎమ్మెల్యే ఇంటి వద్ద సందడి నెలకొంది. టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనకు అభినందనలు తెలిపారు.

● టెక్కలిలో అచ్చెన్నకు ఎదురులేదు..

మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకి టెక్కలి నియోజకవర్గంలో ఎదుదులేదు. ఇప్పటికే ఐదుసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. అచ్చెన్నాయుడు 1996లో హరిశ్చంద్రపురం నియోజకవర్గానికి ఉప ఎన్నికలో బరిలో నిలిచి గెలుపొందారు. అప్పట్లో భారీ మెజార్టీ సాధించారు. తర్వాత 1999లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచే గెలిపొందారు. 2004లో కూడా అదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. నియోజకవర్గం పునర్విభజన తర్వాత 2009లో టెక్కలి నుంచి పోటీచేసి ఓటమి చెందారు. తర్వాత 2014 లో, 2019లోనూ టెక్కలి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రభావం ఎలాఉన్నా.. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ ధాటికి నిలబడలేని పరిస్థితి. ఏడాది కిందట వైసీపీ అధిష్టానం టెక్కలి అభ్యర్థిగా ఒకరి పేరును ప్రకటించి.. మళ్లీ కొద్దిరోజుల వ్యవధిలోనే మార్పు చేసింది. ఇటీవల మళ్లీ పాత అభ్యర్థికే నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. వైసీపీలో అక్కడ నాయకత్వ లేమి కొంత కారణంకాగా... తొలినుంచీ కింజరాపు ఎర్రన్నాయుడి కుటుంబంపై ప్రజలకున్న మక్కువతో అచ్చెన్నకు తరగని ఆదరణ లభిస్తూనే ఉంది. తాజాగా టీడీపీ అధిష్టానం మళ్లీ ఆయనకు టికెట్ కేటాయించడంతో.. ఆరోసారి ఎన్నికల బరిలో దిగనున్నారు.

మామకు ధీటుగా 'కూన'..



ఆమదాలవలస : స్వీట్ తింటున్న కూన రవి

రాష్ట్రంలో ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఏ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపొందుతారో.. ఆ పార్టీయే రాష్ట్రంలోనూ అధికారంలో ఉంటుందని నానుడి. ప్రజలు, అన్ని పార్టీల నాయకులు ఇదో సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. ఇదిలా ఉండగా ఆమదాలవలస నుంచి 2009లో టీడీపీ అభ్యర్థిగా కూన రవికుమార్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. అప్పట్లో పీఆర్పీ అభ్యర్థిగా రవికుమార్ మామ తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డేపల్లి సత్యవతి బరిలో నిలిచారు. ఈ ముగ్గురిలో సత్యవతి విజయం సాధించారు. 2014 లో టీడీపీ నుంచి కూన రవికుమార్.. వైసీపీ నుంచి తమ్మినేని, కాంగ్రెస్ నుంచి బొడ్డేపల్లి బరిలో నిలవగా టీడీపీ విజయం సాధించింది. 2019లో జగన్‌కు ఒక్కఛాన్స్ వల్ల తమ్మినేనిపై పోటీ చేసిన రవికుమార్ ఓటమి చెందారు. తాజాగా మళ్లీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌కే టికెట్ కేటాయించగా.. వైసీపీ కూడా తమ్మినేనికే టికెట్ ఖరారు చేస్తే.. మరోసారి మామపై మేనల్లుడు పోటీకి దిగనున్నారు. ఈ నియోజకవర్గంలో టీడీపీకే విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ పలు సర్వేల్లో వెల్లడైంది.

● పాతపట్నంలో..

పాతపట్నం నియోజకవర్గంలో వంశధార నిర్వాసితులు బహిరంగంగానే టీడీపీకి మద్దతు ఇస్తున్నారు. ఇక్కడ రాజకీయాల్లో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణకు ప్రజాదరణ మెండుగా ఉంది. కొన్నాళ్ల కిందట సాగునీటి ప్రాజెక్టులు సందర్శించి.. పాతపట్నం నియోజకవర్గంలో సభ నిర్వహించిన చంద్రబాబుకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది.

● పలాస నియోజకవర్గంలో...

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పలాస నియోజకవర్గంలో వైసీపీని ఎదిరించి.. వారు పెట్టిన కేసులను ధీటుగా ఢీకొట్టి నిలబడిన గౌతు శిరీష టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఆమె అండగా నిలబడుతుండడంతో ఆదరణ మరింత పెరుగుతోంది. మంత్రిపై స్వపక్షంలో విపక్షం తోడవడం టీడీపీకి కలసివస్తోంది. ఇటీవల నారా లోకేశ్ శంఖారావం సభకు.. అధికారపార్టీ ఆంక్షలు దాటుకుని మరీ.. ప్రజలు తరలిరావడంతో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ మరోసారి నిరూపితమైంది. ఇదిలా ఉండగా.. జనసేన నుంచి ఓ వైద్యుడు ఈ నియోజకవర్గం నుంచి సీటు ఆశిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

● శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్లలో...

ఎచ్చెర్ల నియోజకవర్గం... ఇక్కడ మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు విషయంలో టీడీపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఎచ్చెర్ల నుంచే పోటీలో దింపాలా.. లేదంటే మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచా.. లేదా విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి బరిలో దింపాలా? అని సమాలోచన చేస్తుంది. ఈ కారణంతోనే ప్రస్తుతానికి ఇక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు. ఇదే నియోజకవర్గం నుంచి కలిశెట్టి అప్పలనాయుడు సీటు ఆశిస్తున్నారు. ఇక శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితోపాటు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ టిక్కెట్ ఆశిస్తున్నారు. దీంతో అధిష్ఠానం వీరిద్దరిలో టికెట్ ఎవరికి కేటాయించాలన్న తర్జనభర్జనలో ఉన్నట్లు సమాచారం. నరసన్నపేట నియోజకవర్గంలో మాజీఎమ్మెల్యే, ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తికి ప్రజల్లో సౌమ్యుడిగా గుర్తింపు ఉంది. తాజాగా ఈ నియోజకవర్గం నుంచి రాజకీయనేపథ్యమున్న వైద్యుడు కూడా టీడీపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించకపోవడంతో.. ఎవరికివారుగా తమకే టికెట్ అని భావిస్తున్నారు. సోమవారం సభలోనైనా చంద్రబాబునాయుడు ప్రకటిస్తారేమోనని వేచి చూడాల్సిందే.



నరసన్నపేటలో పరీక్షా కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

నేడు గ్రూప్-2 పరీక్ష

- జిల్లాలో 82 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న 24,500 మంది అభ్యర్థులు
- హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట, ఫిబ్రవరి 24: ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా 82 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. 24,500 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. శ్రీకాకుళం, గార, నరసన్నపేట, ఆమదాలవలస, పోలాకి, రణస్థలం, ఎచ్చెర్ల, కాశీబుగ్గ, సోంపేట, టెక్కలి, కొత్తూరు తదితర పట్టణాల్లో కేంద్రాలను కేటాయించారు. పరీక్షల నిర్వహణ కోసం 82మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22మంది రూట్ అధికారులు, 82మంది అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే సహాయ కేంద్రాలను, వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. రూట్ అధికారులు ఆదివారం ఉదయం 5.30గంటల నుంచే జిల్లా ఖజానా కార్యాలయం నుంచి పరీక్షా పత్రాలను తీసుకుని కేంద్రాలకు వెళ్తారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. అభ్యర్థులను 10.15గంటల వరకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. ఆపై ఒక్క నిమిషం దాటినా అనుమతించరు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్, ఓటరు, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. బ్లూ, లేక నలుపు బాల్‌పెన్ మాత్రమే అనుమతిస్తారు. ఎలైజర్, సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. అభ్యర్థులకు అన్నిరూట్లలో సరిపడా బస్సులను ఆర్టీసీ కేటాయించింది. కేంద్రాల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండారు సత్యనారాయణ తదితరులు

చంద్రబాబు సభ ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి, ఫిబ్రవరి 24: శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో సోమవారం నిర్వహించనున్న 'రా.. కదలి రా' సభకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. పార్టీ శ్రేణులతోపాటు సుమారు లక్షమంది ప్రజలు సభకు తరలిరానున్నారు. ఈ మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సభాస్థలి, వేదిక, హెలీప్యాడ్ నిర్మాణం తదితర ఏర్పాట్లను మాజీమంత్రి బండారు సత్యనారాయణ, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, రాష్ట్ర తెలుకల సాధికార సమితి సభ్యుడు కొమ్మ నాపల్లి వెంకటరామరాజు, మీడియా కో-ఆర్డినేటర్ ఎస్వీ రమణ మాదిగ, జల్లు రాజీవ్, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం, విభూది సూరిబాబు, గుత్తు చిన్నారావు, బుక్కా యుగంధర్ పాల్గొన్నారు.

అద్దె బస్సుల కోసం ఆర్టీసీ టెండర్లు

అరసవల్లి, ఫిబ్రవరి 24: జిల్లాలో అద్దె ప్రాతిపదికన 32 బస్సులు ఇచ్చేందుకు ఔత్సాహిక ఆపరేటర్ల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆసక్తి గల ఆపరేటర్లు సంబంధిత పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని, ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియలో పాల్గొనవచ్చు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ మార్చి 14న ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. శ్రీకాకుళం - విజయవాడ మార్గంలో ఒక సూపర్ లగ్జరీ, శ్రీకాకుళం - విశాఖ మార్గంలో ఆరు అల్ట్రా డీలక్స్‌లు, పలాస - విశాఖ మార్గంలో మూడు, శ్రీకాకుళం - విజయనగరం మార్గంలో నాలుగు, శ్రీకాకుళం-పాలకొండ మార్గంలో రెండు, ఇచ్ఛాపురం - విశాఖ మార్గంలో నాలుగు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, శ్రీకాకుళం-సాలూరు ఒకటి, శ్రీకాకుళం-బత్తిలి ఐదు, టెక్కలి - పలాస(వయా పూండి) రెండు, శ్రీకాకుళం-పలాస ఒకటి, టెక్కలి-శ్రీకాకుళం (వయా సంతబొమ్మాళి) ఒకటి చొప్పున సర్వీసులు కావాలి' అని విజయ్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

విద్యార్థుల ప్రాణాలు.. గాలిలో దీపాలు!



భరణికోట ఆశ్రమ పాఠశాల

- ఆశ్రమ వసతిగృహాల్లో పర్యవేక్షణ కరువు
- సక్రమంగా అందని వైద్యసేవలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



● ఈ నెల 21న భరణికోట గిరిజన బాలికల వసతిగృహంలో ఆరో తరగతి విద్యార్థిని **ఎస్.నందిని** అనారోగ్యానికి గురై మృతి చెందింది. ఈ నెల 10న పాఠశాల నుంచి అనారోగ్యంతో ఇంటికి వెళ్లిన ఆ విద్యార్థిని తిరిగి పాఠశాలకు వెళ్లలేదు. కానీ ఆన్‌లైన్‌లో వసతిగృహంలో ఉంటున్నట్టు హాజరు వేసినట్టు తెలుస్తోంది. వసతిగృహ సిబ్బంది విద్యార్థిని ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవడంతో ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేసి నివేదిక అందజేయాలని ఐటీడీఏ పీవో కల్పనకుమారి ఆదేశించారు.

● గతేడాది సెప్టెంబరు 30న మెళియాపుట్టి కేజీబీవీలో చదువుతున్న దోర వర్షిణి మృతి చెందింది. పాతపట్నం మండలం లాడర గ్రామానికి చెందిన వర్షిణికి చక్కెరస్థాయి పెరగడంతో శ్రీకాకుళంలోని జీజీహెచ్(రిమ్స్)లో చేర్పగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.

● గతేడాది ఏప్రిల్ 17న పెద్దమడి గురుకుల పాఠశాలలో పలాస మండలం సవరగోవింద్‌పురానికి చెందిన 8వ తరగతి విద్యార్థి సవర సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు.

● గతేడాది మార్చి 21న పెద్దమడి గిరిజన బాలికల పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి అధికంగా మాత్రలు మింగి ప్రాణాపాయస్థితికి చేరుకుంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రాణాలతో బయటపడింది.

(మెళియాపుట్టి)

ఆశ్రమ వసతిగృహాల్లో విద్యార్థులు మృత్యువాత పడుతుండడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తప్పడం లేదు. వైద్య, గిరిజన సంక్షేమ శాఖల మధ్య సమన్వయ లోపంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 29ఆశ్రమ పాఠశాలల్లో 4,278 మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతిగృహాలను అధికారులు పర్యవేక్షించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వైద్యసేవలతో పాటు మెనూ కూడా సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మండలస్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు ప్రతినెలా వసతిగృహాలు తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఐటీడీఏ అధికారులు ఆదేశించేవారు. గత ఆరు నెలలుగా ఆటువంటి పరిస్థితి కనిపించడం లేదు. గత తహసీల్దార్ పి. సరోజిని వసతిగృహాల్లో పరిస్థితులు బాగోలేవని నివేదిక ఇచ్చినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

పట్టించుకోని ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వశిక్షా అభియాన్ నిధులతో ప్రతి విద్యార్థికి సంబంధించి ఆరోగ్యస్థితిగతులను వైద్యులు రికార్డుల్లో నమోదు చేసేవారు. రుగ్మతలు ఉంటే వాటి నివారణకు చర్యలు చేపట్టేవారు. గిరిబాల రక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యసేవలు అందజేసేవారు. వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య బట్టి.. ఆరోగ్య కార్యకర్తలను నియమించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సేవలేవీ కొనసాగడం లేదు. ఫ్యామిలీ వైద్యం పేరుతో అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. గతేడాది ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టినా.. విద్యార్థులకు సక్రమంగా వైద్యసేవలు అందడం లేదు. ప్రతినెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తే.. అంతర్గత వ్యాధులు ఉంటే బయటపడే అవకాశం ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత వసతిగృహ విద్యార్థులను పరీక్షించే బాధ్యతలను సీహెచ్‌వోలే చూస్తున్నారు. పాఠశాల సిబ్బంది సైతం అంతా బాగుందనే చెబుతుండడంతో వైద్యాధికారులు తనిఖీలు చేయడం లేదు. ఏఎన్ఎంలకు అధికంగా ఆన్‌లైన్ పనులు, సర్వేలకు కేటాయించడంతో.. వారు కూడా వసతిగృహాలకు వెళ్లి పర్యవేక్షించడం లేదు. అలాగే నిధుల కొరత కారణంగా చాలా వసతిగృహాల్లో కిటికీలకు కనీసం దోమతెరలు కూడా ఏర్పాటు చేయడం లేదు. ఈ క్రమంలో చాలామంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నేలబొంతు ఆశ్రమ పాఠశాలలో కిటికీలకు కానరాని దోమతెరలు

చర్యలు తీసుకుంటాం

వసతిగృహల్లో విద్యార్థుల మృతి సంఘటనపై విచారణ జరుగుతోంది. పీవోకు నివేదిక అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తాం.

- రుగ్మతరావు, డీడీ గిరిజన సంక్షేమ శాఖ, సీతంపేట

పకడ్బందీగా ఎన్నికల నియమావళి

- జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు

అరసవల్లి, ఫిబ్రవరి 24: రానున్న సార్వత్రిక పోరు నేపథ్యంలో పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు చేయాలని జడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఎంసీసీ నోడల్ అధికారులు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనీలు, ఎంపీడీవోలు, స్టేషన్ హౌస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సి-విజిల్, సువిధ తదితర అంశాలపై మొదటి దశ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా బృందాలను ఏర్పాటు చేస్తాం. రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలి. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తప్పనిసరిగా లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలి. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు వారి నుంచి సువిధ యాప్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించాలి. ఎన్నికల నియమావళికి లోబడి ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాల'ని తెలిపారు. ఎలక్ట్రానిక్ ప్రకటనలకు ఎంసీఎంసీ ధ్రువీకరణ, ముందస్తు అనుమతులు తప్పనిసరి అని డీఐపీఆర్వో కె.చెన్నకేశవరావు తెలిపారు. వీటికి సంబంధించి ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ముఖ్య ప్రణాళికా అధికారి ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనిఖీల్లో రూ.10లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని తెలిపారు. సీజ్ చేసిన నగదు, బంగారం వివరాలు, అప్పీల్ చేయవలసిన అంశాలకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా అందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకట్రామన్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ ఎస్.బాలాజీ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఇసుక నిల్వలు పెంచాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 24: స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు పెంచాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మైన్స్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రౌండ్ వాటర్, సెబీ, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లకు సంబంధించి అనుమతిచ్చామని తెలిపారు. నూతన కాంట్రాక్ట్ ఏజెన్సీలు ఇసుక పాయింట్ల వద్ద నిల్వలు పెంచాలని సూచించారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, భూగర్భ గనుల శాఖ అధికారి ఎస్‌కేవీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీటీసీ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ అధికారి రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జాన్, టెక్కలి అధికారి ఫణిభూషణ్‌రెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి



కామరాజు (ఫైల్)

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 24: కొయ్యాం పంచాయతీ కొత్తవానిపేట గ్రామానికి చెందిన అలుపన కామరాజు(43) బోటు బోల్తాపడిన ఘటనలో మృతిచెందాడు. శనివారం ఇదే గ్రామానికి చెందిన మరో ముగ్గురితో కలిసి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లి తిరిగి వస్తుండగా... బోటు బోల్తా పడడంతో నలుగురూ సముద్రంలో కొట్టుకుపోయారు. ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. కొద్ది సేపు తర్వాత కామరాజు మృతదేహం ఒడ్డుకు చేరింది. దీంతో కుటుంబ సభ్యులు, మత్స్యకారులు విషాదంలో మునిగిపోయారు. కామరాజుకి భార్య కన్నమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు భార్య కన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏం చెప్పాలో తెలియక బూతులు మాట్లాడుతున్నారు

- పాతపట్నం అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

హిరమండలం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి ఏమిటో చెప్పలేక వైసీపీ నాయకులు బూతులు మాట్లాడుతున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. శనివారం గొట్ట గ్రామంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు తిడుతున్నారు.. చంద్రబాబుపై దుమ్మెత్తి పోస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాల్లో కూరుకు పోయిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని కోరారు. మళ్లీ జగన్‌ని ముఖ్యమంత్రిని చేస్తే మీ మూడో బిడ్డనంటూ మీ ఆస్తులను కూడా లాక్కుంటాడన్నారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తును ఈ సర్కారు చీకట్లోకి నెట్టి వేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, నేతలు బర్రి సురేష్, ఎస్.గోవిందరావు, రామారావు, దారపు డిల్లేశ్వరరావు, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎన్‌పేట: టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

చింతలబడవంజ(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. చింతలబడవంజ గ్రామ పెద్ద చెరువుకు రూ.4.80 లక్షలు, డొంకలబడవంజ గ్రామ సమీపంలోని వంశధార నది కుడి ప్రధాన కాలువ కు రూ.3.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన మెట్లను శనివారం ప్రారంభించారు. ధనుకువాడ నుంచి మిరి యాపల్లి రోడ్డుకు రూ.9.50 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజ లతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు రాజకీయాలు శాశ్వతం కావని, చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా తనకు సాధ్యమైనంత వరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నా నన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే పార్టీలో చేరికలు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలనా విధానాలపై ప్రజలు విరక్తి చెంది ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని ఎంపీ అన్నారు. డొంకలబడవంజ గ్రామానికి చెందిన పది కుటుంబాలవారు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వార్థ రాజకీయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె గింపేందుకు ఓటర్లు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, సర్పంచ్ వి.లక్ష్మి, నాయకులు ఎస్.కిషోర్‌బాబు, సీహెచ్ శ్రీనివాసరావు, వి.ఆనందరావు, ఎస్.తేజేశ్వరరావు, జి.మోహనరావు, వి.సత్య నారాయణ, గోవిందరావు, బి.బాలకృష్ణ, ఎం.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

సైకో రెడ్డిని ఇంటికి పంపడం ఖాయం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్
- మాజీ సర్పంచ్ సహా.. 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో సైకో రెడ్డిని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శనివారం కట్యాచార్యులుపేట గ్రామంలో వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ పైడి జగన్నాథరావుతోపాటు పైడి ఆనందరావు, సింగూరు రాజు, ఇలపండ రాజు, పద్మావతి మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి రవివకుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురుతుందన్నారు. టీడీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి గెలుపునకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూకరాజు, సనపల డిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కూన రవికుమార్

వైసీపీ నుంచి టీడీపీలోకి పలు కుటుంబాలు

జి.సిగడాం: సీతంపేట గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వల్లూరు వరహాల నాయుడు, కండాపు పాపినాయుడు, కె.సూరపు నాయుడు, కె.జనార్దన్, వి.రమణమూర్తి, వి.లక్షుం నాయు డు, టి.లక్షుంనాయుడు, కె.గోవిందరావు, డి.జనార్దన, కె.అప్పల నాయుడు, శాసపు రామ్‌ప్రసాద్, వి.రామ్మూర్తి, వి.అన్నం నాయుడు, వి.లక్షుంనాయుడు తదితరులున్నారు. కార్యక్రమంలో టంకాల మౌళీశ్వరరావు, పైల రామకృష్ణం నాయుడు, నక్క మురళి, మక్క చినప్పలనాయుడు, కండాపు చిన్నం నాయుడు, మీసాల రమణారావు, విక్రం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కళావెంకటరావు, రామ్‌మల్లిక్ నాయుడు

గొండు శంకర్ ఆధ్వర్యంలో...



అరసవల్లి: పార్టీలో చేరిన వారితో గొండు శంకర్

అరసవల్లి: టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో శనివారం మండలవీధి ప్రాంతానికి చెందిన 30 మంది మహిళలు టీడీపీలో చేరారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో శంకర్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని, రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రానున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, బొల్ల నాగేంద్ర యాదవ్, బుర్రి మధు, సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీలో వాటాలు నిగ్గు తేల్చాలి

- మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



దొంపాక ఇసుకర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, ఫిబ్రవరి 24: ఇసుక అక్రమ దోపిడీలో స్థానిక వైసీపీ నాయకులకు, తాడేపల్లి ప్యాలెస్‌కు వాటాలు ఎంతెంత అనేది నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి డిమాండ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వ హిస్తున్న దొంపాక ఇసుక ర్యాంపు వద్ద శనివారం టీడీపీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరిస్తూ ఇసుక తవ్వకాలు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వంశధార నదిలో రోడ్డు నిర్మించి 3 మీటర్ల లోతులో ఇసుక తవ్వకాలు జేసీబీల ద్వారా చేపట్టి అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొమనాపల్లి వంతెనకు కూత వేటు దూరంలో దొంపాక వద్ద ఇసుక ర్యాంపును అక్రమంగా నిర్వహిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, తర్ర బలరాం, పి.దాలయ్య, జి.బాలకృష్ణ, శిమ్మ తారకేశ్వరరావు, నక్క రమేష్, బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బూర్జ: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. వైకుంఠపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, మహిళలకు ఎన్నో చట్టాలున్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, బూర్జ ఎస్ఐ ప్రసాద్, వైకుంఠపురం సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, ఎంపీటీసీ కరణం కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి మణి

యువత సన్మార్గంలో పయనించాలి

నరసన్నపేట: యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక కోర్టు జూనియన్ సివిల్ న్యాయాధికారి హరిప్రియ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యాశ, క్షణికావేశాలకు లోను కాకుండా యువత సన్మారం వైపు పయనించాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామాల్లో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి

వజ్రపుకొత్తూరు: మహిళాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని మంత్రి అప్పలరాజు అన్నారు. శనివారం గోవిందపురం, ఉద్దానం గోపినాధపురం, అమలపాడు, పెద్ద మురహరిపురం పంచాయతీల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, బీటీ రోడ్డు, బస్టాండ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ పాలిన శ్రావణి, పీఏసీఎస్ ఛైర్మన్ డి.మధు కేశవరావు, సర్పంచ్‌లు కర్ని శ్రీనివాస్, పాలిన చిరంజీవి, దున్న బాలరాజు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

నరసన్నపేట: నియోజవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పట్టణంలో ప్రతి వీధికి సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కోటి గోవిందనామ సప్తాహం ప్రారంభం

టెక్కలి: వేంకటేశ్వర గీతా భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం కోటి గోవింద నామాల సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. నగర సంకీర్తన, గోపూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి డా.కిల్లి కృపారాణి, మాజీ సర్పంచ్ టంకాల పావనీ రాణి, టీటీజీ గుప్త, భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

గురుకులానికి ఇన్వెర్టర్ వితరణ

నందిగాం: నందిగాం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వినియోగించేందుకు గాను కాశీబుగ్గకు చెందిన వైద్యులు టి.బాలకృష్ణ ఇన్వెర్టర్‌ను శనివారం ప్రిన్సిపాల్ బి.దమయంతికి అందజేశారు. క్రమశిక్షణలతో విద్యనభ్యసించాలన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

పలాసరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ అన్నారు. గరుడఖండి పంచాయతీలో శనివారం ప్రజాపోరు-2 భాగంగా ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగించారు. కన్వీనర్ మామిడి ప్రసాద్, మోహనరాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

మాదిగ ద్రోహి.. జగన్‌రెడ్డిని నమ్మకండి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు కృష్ణమాదిగ

ఆమదాలవలస: మాదిగల ద్రోహి సీఎం జగన్ రెడ్డి అని.. ఎవరూ నమ్మవద్దని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మాదిగ కులస్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు మాదిగలకు అనుకూలంగా వ్యవహరించడం ద్వారా 22 వేల ఉద్యోగాలు లబ్ధి పొందారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాదయాత్రలో మాదిగులు సమస్యలపై ఇచ్చిన అర్జీలు బుట్టదాఖలు చేసి ఎస్సీలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీకి మద్దతుగా నిలవా లన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు తేజేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు లోపింటి నారాయణ రావు, నాయకులు టింగరాజు, రాడ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హరిపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్ఎం ఎస్.కరుణాకర్ అన్నారు. సొండిపూడి పరిధిలోని బాలాజీపురం, మూలిపాడు గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు శనివారం రాత్రి వారు వెళ్లారు. 'మేము సైతం మా పిల్లల కోసం' లో భాగంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పలు సూచనలు చేశారు. చదువుతోపాటు పౌష్టికాహారం విలువలను తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, తులసీ దాస్, వెంకట రమణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అజెండాతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

అరసవల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సరికొత్త ప్రజా మేనిఫెస్టో తయారు కావాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక కో-కన్వీనర్ భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం ఎన్జీవో హోంలో పంచాది రాంబాబు అధ్యక్షతన వివిధ ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ సొంత ప్రయోజ నాల కోసం పనిచేసుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. శ్రీకాకుళం, విజయ నగరం తాగు, సాగునీటి ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి, వంశధార రెండో దశ, గజపతినగరం బ్రాంచ్ కాలువ, వంశధార, నాగావళి నదుల అనుసంధానం, మహేంద్ర తనయ రిజర్వాయర్, మడ్డువలస రెండో దశ, తారక రామ తీర్థ సాగర్ ప్రాజెక్టు పనులతో పాటు పెండింగ్ ప్రాజెక్టులు నేటికీ పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో బి.జగదీష్, బి.గౌరీ శంకర్, బి.జానకిరామ్, జె.బాలరాజు, లక్ష్మణ్, యు.శివతేజ, సుప్రజ, రవితేజ, చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

వైసీపీ పాలనకు చరమగీతం తప్పదు: ఎన్ఈఆర్

రణస్థలం: రాష్ట్రంలో అవినీతి పాలన కు కేరాఫ్‌గా మారిన వైసీపీ అసమర్థ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా రణస్థలం మండలం నారువా గ్రామంలో ఆయన పర్యటించి, వైసీపీ ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ నిరుపేదల అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీరు గురునాథరెడ్డి, పీవీ రత్నం, గొర్లె శ్రీహరి, పతివాడ పైడినాయుడు, మన్నే సురేష్, కొమర లక్ష్మణ్, మన్నే శ్యామకుమార్ పాల్గొన్నారు.



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు

ఆయన కళ్లు సజీవం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ మెట్టవీధికి చెందిన చిలుకు కన్నయ్య (79) మృతి చెందడంతో ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ప్రజాచైతన్య కళాసమితి సభ్యుల చొరవతో శనివారం శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి సమా చారం అందించారు. టెక్నీషియన్లు టి.సుజాత, కె.పవన్ వచ్చిన కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా కన్నయ్య భార్య నూకరత్నంను ప్రజా చైతన్య కళాసమితి సభ్యులు డీఏ స్టాలిన్, చిలుకు కృష్ణారావు, చిట్టిన్న, రమేష్ కుమార్, గణపతిరావు, పద్మనాభం తదితరులు అభినందించారు.



కన్నయ్య (ఫైల్)

నాసో ప్రతిభ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం: నేషనల్ ఆస్ట్రోనమీ అండ్ సైన్స్ ఒలంపియాడ్ (నాసో) నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో అమర జ్యోతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ఇటీవల విడుదలైన లెవెల్-1లో ప్రతిభ కనబరిచి లెవెల్-2కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మునిసిపల్ అధికారుల తీరు దారుణం

- ఇంత చెత్త మున్సిపాలిటీని ఎప్పుడూ చూడలేదు
- టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ ఆవేదన

పలాస, ఫిబ్రవరి 24: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఏర్పడిన తరువాత నాలుగు పాలకవర్గాలు ఏలాయని, అయితే ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అధికారుల తీరు దారుణంగా ఉందని, ఇంత చెత్త మునిసిపాలిటీని మునుపెన్నడూ చూడలేదని 27వ వార్డు టీడీపీ సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం కౌన్సిల్ హాల్‌లో మునిసిపల్ పాలకమండలి సమావేశం ఛైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. తన వార్డులో మూడేళ్ల కిందట మంజూరైన పనులు నేటికీ జరగలేదని, తాగునీటి ఎద్దడి ఉందని, బోర్లు మరమ్మ తులు చేయాలని అనేక పర్యాయాలు సభలో ప్రస్తావించినా అధికారుల్లో చలనం లేదని ఆరోపించారు. అధికా రుల తీరు వల్ల వార్డుల్లో తిరగలేకపోతున్నామని, ప్రజలు చీవాట్లు పెడుతున్నారని, టీడీపీ సభ్యులం కావడమే నేరమా అని ప్రశ్నించారు. టీడీపీతో పాటు అధికార పక్ష సభ్యుల వార్డుల్లోనూ పనులకు మోక్షం లేకుండా పోతోందని, అధికారుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. టీడీపీ కౌన్సిలర్లు జోగ త్రివేణి, డొక్కరి తులసి మాట్లాడుతూ.. మా వార్డుల్లో పవర్‌బోర్లు మంజూరైనా ఇంతవరకు వేయడం లేదని, బోర్లు మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికలు పేరుకు పోయి నెలలు గడుస్తున్నా సిబ్బంది కనీసం ఆ ఛాయలకు రావడం లేదని సభలో ప్రస్తావించారు. దీనిపై ఛైర్మన్ గిరిబాబు స్పందిస్తూ.. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని, గతంలో వేసిన టెండర్లు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జాప్యం జరిగిందని, సచివాలయ ఇంజనీర్లతో పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ సూర్యనారాయణ

ఏఈ తీరుతో పాలకవర్గం పరువుపోయింది

మునిసిపాలిటీలో ఏఈ అసమర్థత వల్ల పాలకవర్గం పరువు బజారు పాలైందని, ఆయనను తక్షణం తొలగించాలని వైసీపీ కౌన్సిలర్ గుజ్జు జోగారావు డిమాండ్ చేశారు. 9వ వార్డులో అనేక పనులు మంజూరైనా ఆ ఇంజనీర్ వల్ల ఒక్క పని కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారంతో ప్రజల్లో కౌన్సిలర్లకు విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తూ 'సేవ్ కౌన్సిలర్స్ డిగ్నిటీ' అంటూ ప్లకార్డు ప్రద ర్శించి నిరసన తెలిపారు. దీనికి ఛైర్మన్ స్పందిస్తూ.. ఏఈ అవినాష్ వ్యవహారం వల్ల పాలకులు తలదించుకో వాల్సి వస్తోందని, అనేక మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పైగా డీఈఈ బాధ్యతలు అదనంగా అప్పగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రోజు సెలవు పెట్టి ఈనెల 3 నుంచి ఆయన విధులకు డుమ్మా కొడుతున్నారని, ఫోన్‌లో కూడా స్పందించడం లేదని సభ దృష్టికి తీసుకు వచ్చారు. పాత ఫైల్స్ సంతకాలకు శ్రీకాకుళం రమ్మని సిబ్బంది, కాంట్రాక్టర్లకు చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం ఆమోదిస్తే ఆయనను సాగనంపుదామన్నారు. తక్షణం ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఎంఏకు లేఖ రాయాలని ఇన్‌చార్జి కమిషనర్ ఆర్.అప్పలస్వామిని ఆదేశించారు.

కన్నుల పండువగా వెంకన్న చక్రతీర్థ స్నానం

జలుమూరు (సారవకోట): చీడిపూడి గ్రామంలో వెల సిన శ్రీవేంకటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ 91వ వార్షికోత్సవం సందర్భంగా 5 రోజుల పాటు నిర్వ హించిన ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి గేదెల బాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు రామాంజనేయులు తదితరులు స్వామివారి చక్రతీర్థ స్నానాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు →



రేపటి నుంచి జాతీయస్థాయి గోకార్ట్ పోటీలు

కె.కొత్తూరు(టెక్కలి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు 2024 గోకార్ట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 15 ఇంజనీరింగ్ కళాశాలలు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. విజేతలకు రూ.4లక్షల బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గోకార్ట్ వాహనం తయారీకి 20 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని, డిజైన్, బ్రేకింగ్, సాంకేతిక తనిఖీలను నిపుణులు పరిశీలించిన అనంతరం రేస్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారన్నారు.



ఘనంగా కొత్తమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

నందిగాం: కణితూరులో కొలువై ఉన్న కొత్తమ్మ తల్లి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు డి.ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచామృతా భిషేకం, మహిళలతో లక్ష కుంకుమార్చన, లలితాహోమం చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. గ్రామానికి చెందిన పేరాడ ప్రసాదరావు జ్ఞాపకార్థం నిర్మించిన ఆలయంలో పేరాడ కుటుంబీకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ జిల్లా సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపీపీ ఎం. శ్రీరామమూర్తి, జడ్పీటీసీ టి.భార్గవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాత్రికేయుల రక్షణకు చట్టం తీసుకురావాలి

నందిగాం: నిర్భయ, అట్రాసిటీ చట్టాల మాదిరిగా పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాప్తాడులో ఇటీవల ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమన్నారు. దాడు లకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, వారిపై రౌడీ షీట్ తెరిచి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలని అయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు

లావేరు: చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిటీ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. శనివారం గురుగుబిల్లి, రావివలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ ఆరు పథకాలకు సంబంధించి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైయిందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఐ.తోటయ్యదొర, గురుగుబిల్లి సర్పంచ్ బాడిత లక్ష్మణరావు, నాయకులు బాడిత చిట్టిబాబు, డి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు. గురుగుబిల్లికి చెందిన దొండపాటి వెంకటరావు, బాలకృష్ణ, మల్లేష్‌తో పాటు మరో 10కుటుంబాల వారు వైసీపీ, ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరారు. వీరందరికీ కళా వెంకటరావు టీడీపీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్



జి.సిగడాం: మదుపాంలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

జి.సిగడాం: విజన్‌గల నాయకుడు చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమని మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మదుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు అన్నారు. శనివారం మదుపాం, డీఆర్ వలస, బాతువ, పెంట, గొబ్బూరు, పెనసాం, దేవరవలస తదితర గ్రామాల్లో నిర్వహించిన బాబుష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో వారు మాట్లాడారు కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుదిరెళ్ల బుజ్జి, మండల ప్రధాన కార్యదర్శి జక్కంపూడి దాసు, సర్పంచ్ మహాదాశ్యం చిన్నారావు, మక్క నారాయణరావు, కూనుబిల్లి శ్రీనివాసరావు, కె.సంతోష్‌కుమార్, మీసాల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి పెద్దపీట



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం రూరల్: సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయనున్నట్టు శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. సింగుపురం గ్రామంలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీదేవి పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోరుబద్ర పాపారావు, మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బలగ మురళి, నాయకులు చీపురు ఆనంద్, జి.అప్పలరాజు, ఎం.అసిరినాయుడు, రమణ, రమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



సారవకోట మండలం అన్నుపురంలో..

జలుమూరు, (సారవకోట): చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. అన్నుపురంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాడేల భీమారావు, ఇస్సే నాగరాజు, యడ్ల పాపారావు పాల్గొన్నారు.



లావేరు: గురుగుబిల్లిలో పర్యటిస్తున్న కళావెంకటరావు

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొత్తూరు: 'రా..కదలిరా' పేరుతో శ్రీకాకుళంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి కోరారు. మాతలలోని కార్యాలయంలో టీడీపీ నేత లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి మాట్లాడుతూ.. రానున్నది టీడీపీ- జనసేన ప్రభుత్వమన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'రా కదలిరా' సభకు తరలిరావాలి

పాతపట్నం: శ్రీకాకుళంలో ఈనెల 26న నిర్వహించనున్న 'రా కదలిరా' కార్యక్రమానికి ప్రజలంతా తరలి రావాలని టీడీపీ నాయకుడు మామిడి గోవిందరావు ఒక ప్రకటనలో కోరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొంటున్న సభకు పాతపట్నం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు తదితరులు హాజరుకావాలని కోరారు.

బహిరంగ సభకు తరలిరండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, (సారవకోట): శ్రీకాకుళంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 26న నిర్వహించనున్న 'రా.. తరలిరా' బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. నవరడ్డపనస పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల పరిశీలకుడు రమేష్‌కుమార్, టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, జలుమూరు, సారవకోట మండలాల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, నాయకులు సాధు చిన్ని కృష్ణంనాయుడు, సురవరపు తిరుపతిరావు, బగ్గు గోవిందరావు, వెలమల చంద్రభూషణరావు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొందూరు: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఈ నెల 26న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించనున్న రా.. కదలిరా సభను కార్యకర్తలు, అభిమానులు, నాయకులు విజయవంతం చేయాలని కార్యక్రమ ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులు బత్తుల తాతయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్‌తో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వేలాది సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కొర్లయ్య(ఫైల్)

శ్రీకాకుళం క్రైం: ఓ వ్యక్తి తన కారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక దమ్మలవీధికి చెందిన మాడుపిట్ల కొర్లయ్య (కిరణ్‌కుమార్) (34) ఫొటోగ్రాఫర్ గా ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. 2018 లో బుడుమూరుకు చెందిన నారాయణమ్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో కుమారుడు రెండేళ్ల కిందట చనిపోయాడు. వృత్తి రీత్యా కొర్లయ్య ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రికే వస్తాడు. ఒక్కోసారి రాత్రుళ్లు కూడా ఇంటికి రాకుండా మరుసటి రోజు వచ్చేవాడు. అయితే శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన కొర్లయ్య రాత్రికి ఇంటికి రాకపోవడంతో భార్య నారాయణమ్మ ఫోన్ చేయగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. శనివారం ఉదయం కూడా కొర్లయ్య రాకపోవడంతో భార్య బంధువుల సాయంతో వెతికింది. అయితే అదే సమయంలో వన్‌టౌన్ పోలీసులు నారాయణమ్మకు తన భర్త చనిపోయినట్టు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం నుంచి కొర్లయ్య తన కారును అరసవిల్లి సెగిడివీధిలో ఉన్న పీహెచ్‌సీ ఎదురుగా పార్క్ చేసి ఉంచాడు. శనివారం కూడా కారు అక్కడే ఉండటంతో పీహెచ్‌సీ సిబ్బంది వెళ్లిచూడగా కారులో కొర్లయ్య చనిపోయి ఉన్నాడు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా తన భర్త మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ నారాయణమ్మ ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీని ఢీకొన్న లారీ



శ్రీకాకుళం క్రైం: జాతీయ రహదారి భైరి గ్రామం వద్ద ట్రాలీ (తేక లారీ)ని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ట్రాలీ భైరి జంక్షన్‌లో బ్రిడ్జి ఎక్కుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. అయితే కొద్ది క్షణాల్లోనే మరో లారీ ప్రమాదానికి గురైన లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక ఉన్న లారీలో ఉన్న వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

బెల్లం ఊటలు ధ్వంసం

హరిపురం: మందస మండలం పిడిమందస పంచాయతీ సవరమధ్య గ్రామంలో ఎస్ఈబీ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1300 లీటర్ల బెల్ల ఊటలు ధ్వంసం చేసినట్లు సీఐ ఆర్.జైబీమ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ.. సారా బట్టీలు నిర్వహించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారాకు సంబంధించిన సమాచారాన్ని 94409 02358 నెంబరుకు అందజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగీశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ సభ్యుల నిరసన



ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

కంచిలి: ఇసుక, గ్రావెల్ కంకర తరలిస్తున్న ట్రాక్టర్లపై విశ్వసముద్ర యాజమాన్యం నిబంధనల పేరిట వేధింపులకు పాల్పడుతుందని ట్రాక్టర్ సీనియర్ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం మండలానికి చెందిన ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు తమ వాహనాలను నిలిపి వేసి దుష్ట సముద్ర కార్యాలయం జలంత్రకోట వద్ద ఆందోళన చేశారు. ట్రాక్టర్లు నడుపుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామని సంస్థ ప్రతినిధులు ఒత్తిడికి లోనవుతున్నామని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు సంస్థ, యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కంచిలి, సోంపేట ట్రాక్టర్ యూనియన్స్ సభ్యులు బి.కామేష్‌రెడ్డి, పైల రామారావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, గజేంద్ర, సాలిన నారాయణస్వామి ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండల గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజాప్రతినిధులు గళమెత్తారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై అధికారులు దృష్టిసారించడం లేదని వారు మండిపడ్డారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీడీవో సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా మండల ప్రజా ప్రతినిధులంతా విద్యుత్, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఎంపీటీసీ నక్క శంకర్, జడ్పీటీసీ రుప్ప దివ్య, ఏఎంసీ ఛైర్మన్ మూకుళ్ల తాతబాబు, ఎంపీటీసీ అంబటి నిర్మల, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు అభినందనల వెల్లువ



అశోక్‌ను అభినందిస్తున్న ఇచ్ఛాపురం టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్‌ను మరోసారి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు అంబరాన్నంటాయి. మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అశోక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ సాడి సహదేవ రెడ్డి, దక్కత కామేష్, లోపింట పద్మనాభం, దక్కత శ్రీను, సూర్యనారాయణ, బాబ్జీ, బాలరాజు, కె.గోపి, కరగాన, కృష్ణ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌కు సీటు కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● **కంచిలి:** ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే సీట్ కేటాయించడంపై కంచిలి టీడీపీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే అశోక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్ పట్నాయక్, మురళీమోహన్, కురయ్య పాల్గొన్నారు.

రామయ్యపుట్టుగలో ..

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా బెందాళం అశోక్ ఖరారు చేయడంపై ఆయన స్వగ్రామం రామయ్యపుట్టుగలో శనివారం టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుతూ సందడి చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి అశోక్ కవిటిలోని చింతామణి అమ్మవారి గుడికి బైక్‌పై ర్యాలీగా వెళ్లి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి, బాణాసంచాలతో సందడి చేశారు.

● **సోంపేట:** ఇచ్ఛాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బెందాళం అశోక్‌ను ప్రకటించడంపై మండల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు పట్టణంలో శనివారం కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, టౌన్ పార్టీ అధ్యక్షుడు బీన ఆనంద్, బీన్ ప్రదీప్, బైపల్లి బాబూరావు, చిత్రాడ శేఖర్, దూసి మధుసూదన్, జుత్తు పురుషోత్తం,జనసేన కార్యదర్శి బైపల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గార: శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. మాఘపూర్ణిమ రోజున జరిగే ఈ ఉత్సవంలో భాగంగా తొలుత విశ్వక్షేణ పూజ, పున్యాహ వచనం, పరిషత్ చూర్ణిక ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారినీ దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి ప్రసాద వితరణ చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

కవిటి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ నేతలు కవిటిలో శనివారం జనసేన నేత లోళ్ల రాజేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. పాత పెన్షన్ విధానాన్ని మార్చి 2004 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలు జరుగుతుందని దానిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబాలకు భద్రత లేకుండా పోతుందని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎల్.బాబూరావు అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని యూటీఎఫ్ నేతలకు రాజేష్ హామీ ఇచ్చారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

జి.సిగడాం: వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం అన్నారు. శనివారం చంద్రయ్యపేట, దేవరవలస తదితర గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. పెట్రోలు, ఇసుక, సిమెంట్, విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. రాష్ట్ర ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ అన్నివిధాల సహకారాన్ని అందించారన్నారు.


బీజేపీ ప్రజాపోరు

సోంపేట: బారువ, చాపలగొల్లగండి, పల్లిగొల్లగండి, కొర్లాం, పాలవలస గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు-2ను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 31 పంచాయతీల్లో 60 గ్రామాల్లో రూ.17.67 కోట్లతో 1697 పనులు చేపట్టారు. వీటిపై సీఆర్‌పీలు, డీఆర్‌పీలు ఇంటింటికి వెళ్లి పనులు జరిగిన తీరుపై సమాచారాన్ని సేకరించారు. ఈ నివేదికను గ్రామాల వారీగా సామాజిక తనిఖీల్లో చదివి వినిపించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టిరాజు, ఏపీడీ లోకేష్, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తమరావు, సీఆర్‌పీలు, డీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్స్, క్షేత్రసహాయకులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి జోత్స్న

పొందూరు: భవిష్యత్తు నిర్దేశకులైన విద్యార్థులకు చట్టాలు, న్యాయపరమైన అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవా సంఘ ఛైర్‌పర్సన్ బి.జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలో సిస్టం డిగ్రీ కళాశాలలో శనివారం మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహనలేమితో భవిష్యత్తును అంధకారం చేసుకోకుండా ఉండాలంటే సాధారణ విద్యతోపాటు చట్టాలు, న్యాయపరమైన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఎం.మోహనరావు, బార్‌అసోసియేషన్ సభ్యులు వైవీ బ్రహ్మాజీ, పి.రామ్మోహన్, ఎం.రాము, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు..

ఉపాధ్యాయులకు పోలీసు నోటీసులు

పొందూరు: ప్రజాస్వామ్య బద్ధంగా సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల విజవాడలో చేపట్టనున్న మహాధర్నాకు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధాయులు హాజరుకాకుండా పోలీసులు ఉపాధ్యాయ సంఘ నాయకులకు ముందస్తు నోటీసులు అందించారు. తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్నకు పొందూరు పోలీసులు నోటీసులు అందించి మహాధర్నాలో పాల్గొనవద్దని హెచ్చరించారు.

దేవీ ఆశ్రమంలో పూజలు



శ్రీచక్రాల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ చక్రాలకు భక్తులచే కుంకుమ పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిలక్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రామ్మోహన్ తదితరులు

అరసవల్లి: జిల్లా చరిత్రలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ఘనత దేదీప్యమానమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద గల ఈ స్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తిలక్ హాల్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం కోసం రూ.50లక్షలు ఎంపీ ల్యాడ్స్‌తో దీనిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, మున్సిపల్ ఇంజనీర్ పొగిరి సుగుణాకరరావు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు వీజీకే మూర్తి, ప్రధాన కార్యదర్శి జామి భీమశంకర్, ఉపాధ్యక్షుడు పేర్ల కామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలమురళీ, హెచ్ఎం సీహెచ్ దేవదత్తానంద్ తదితరులు పాల్గొన్నారు.

జాగిలానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీసు జాగిలం అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల: జిల్లా పోలీసు శాఖకు చెందిన జాగిలం (డాన్) అందించిన సేవలు మరవలేమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. అనారోగ్యంతో శనివారం మృతిచెందిన పోలీసు జాగిలానికి ఎచ్చెర్ల సాయుధ మైదానం ఆవరణలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 12 ఏళ్లకు పైగా పోలీసు జాగిలం డాన్ ఎనలేని సేవలందించిందన్నారు. విధి నిర్వహణలో డాన్ మంచి ట్రాకర్ డాగ్‌గా గుర్తింపు పొందిందన్నారు. 2011, జూలై 24న జన్మించిన పోలీసు జాగిలానికి డాన్‌గా నామకరణం చేశారు. ఈ జాగిలం డాబర్‌మెన్ జాతికి చెందింది. ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు, ఆర్ఐ రమేష్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీలే ధ్యేయం

లావేరు: దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా తీర్చి దిద్దడమే ధ్యేయమని వ్యయం వ్యవస్థాపకులు, రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డీజీపీ పీవీ సునీల్ కుమార్ అన్నారు. శనివారం గుమడాంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యపడదుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎం నాయకులు, ట్రైక్వాండో శ్రీను, తాలాడ రవీంద్ర, సీర రాము, పి.రాంబాబు, నేతల అప్పారావు, చంతు, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు టిక్కెట్‌తో సంబరాలు

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా కూన రవికుమార్ పేరును ఆ పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఉన్న రవికుమార్‌ను మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, పార్టీ నాయకులతో కలిసి వెళ్లి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమదాలవలస టీడీపీ అభ్యర్థిగా నాలుగోసారి టిక్కెట్ సాధించడంపై ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాలతో పాటు ఆమదాలవలస మున్సిపాలిటీలో టీడీపీ నాయకులు బాణసంచా కాల్చుతూ సందడి చేశారు.

29లోగా అడ్మిషన్లకు సంప్రదించాలి

ఎచ్చెర్ల: ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ సంయుక్తంగా ఎచ్చెర్ల టీటీడీసీలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌లో పేమెంట్స్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతుల్లో ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన యువతీ యువకులు శిక్షణలో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 29వ తేదీలోగా ఎచ్చెర్ల టీటీడీసీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73373 30138, 82476 56581 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేయొద్దు

శ్రీకాకుళం కల్చరల్: ఓదార్పు యాత్రలో నిరుద్యోగులకు ఇచ్చి హామీలు పూర్తిగా అమలు చేయకుండా ముఖ్యమంత్రి జగన్ తీవ్ర అన్యాయం చేశారని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కేంద్ర గ్రంథాలయం వద్ద ప్రభుత్వ విధానాలపై నిరుద్యోగులంతా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను జగన్ ప్రభుత్వం తుంగన తొక్కి, తూతూ మంత్రంగా ఖాళీలతో నోటిఫికేషన్లు ఇవ్వడం దారుణమన్నారు.


చదవడం అలవాటుగా మార్చుకోండి

గుజరాతీపేట: విద్యార్థులు కళాశాల దశ నుంచే పుస్తకాలు చదవడం మంచి అలవాటుగా మార్చుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మహిళా కళాశాల లైబ్రరీలో పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. కార్య క్రమాన్ని ప్రిన్సిపాల్ లాంఛనంగా ప్రారంభించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, అధ్యాపకులు సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ రాక

అరసవల్లి: ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ ఆదివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10 గంటలకు రణస్థలం మండలం కొత్త పెట్రోల్ బంకు వెనుక ముక్తంపురం కొండ ప్రాంతం సమీపాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారని డీపీఆర్వో శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సువర్ణరాజు

గుజరాతీపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖాధికారులు అందరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అధికారులకు సూచించారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం న్యాయసదన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునన్నారు. సమావేశంలో డీఈవో కె.వెంకటేశ్వరరావు, పోస్టల్ శాఖ నుంచి కామేశ్వర్ చంద్ర పాత్ర, రెవెన్యూ నుంచి బీటీవీ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

ఆమదాలవలస/ సరుబుజ్జిలి: సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో నిర్మించిన పీహెచ్‌సీని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తాగునీటి కొళాయిలను, ట్యాంక్‌ను ప్రారంభించారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.